తెలతెల వారు తుండగా మెలకువ వచ్చిచూసింది అరుణ. ప్రక్కమంచంలో గాని కొంతదూరంలో క్రిందపడుకున్న వ్యక్తుల్లోగాని తల్లి కనబడలేదు. ఆత్రంగా లేవబోయిందిగాని ఒళ్ళంతా సచ్చుగా ఉంది. అమ్మా అని గట్టిగా అరవబోయిందికాని ఆ కంఠంలోంచి వచ్చిన స్వరం తనకే వినబడలేదు. నిస్సత్తువతో మూల్గింది. ఎవరో వస్తున్న అలికిడికి ఆత్రంతో చూసింది. తెల్ల గౌను తలమీద తెల్ల కాప్ వేసుకుని తన మంచం దగ్గరకు వచ్చిన వ్యక్తి నర్సే అని పోల్చుకుంది.

ఆమె దగ్గరకు వచ్చి అరుణ తలమీద చేయివేసి ఆప్యాయంగా నిమిరింది.

"ఎలా ఉంది అరుణా ?"

# తాతయ్య

బి. కోమలాదేవి



"బాగానే ఉంది. నీరసంగా ఉంది. అమ్మ-నాన్న ఎక్కడున్నారండీ?"

"పడుకున్నారమ్మా" అని అరుణను లేపి ముఖం కడిగించి వేడి వేడి పాలు త్రాగించింది.

అరుణ పాలు త్రాగి పడుకుంది. కాస్త బలం వచ్చినలా ఉంది. దాంతో ఆమె ఆలోచనలు క్రమ పద్ధతిలో పయనించాయి.

తను ఇక్కడ ఎందుకుంది? అమ్మా నాన్న ఎక్కడున్నారు? పడుకుంటే ఎక్కడో ఎందుకు పడుకున్నారు?

ఆ రోజు తను ఎంబ్రాయిడరీ చేసిన గౌను వేసుకుంది. అమ్మ పోనీ టెయిల్ కట్టి ఒక చేమంతిపువ్వు పెట్టింది. అమ్మ నీలంరంగు పట్టుచీర కట్టుకుంది. నాన్న నీలంరంగు టై కట్టుకున్నాడు. అంతా నవ్వుతున్నారు. పెద్దనాన్నగారు-పెద్దమ్మ అక్కయ్యలు అన్నయ్యలు అంతా వాన్‌లో వచ్చారు. నాన్న బెడ్డింగుట్రంకు వాన్‌లో పెట్టించారు. అంతా చిన్నత్త పెళ్లికి బయలుదేరారు. ఆ వాన్‌లో ఇంకా ఎవరెవరో ఉన్నారు. తనకు వాళ్ళెవరైంది తెలీదు

ఎంతో సరదాగా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఆ తర్వాత ఏమైంది? అరుణ చెవుల్లో భయంకరమైన అరుపులు గింగురుమన్నాయి. నాన్న తనను కిటికీ లోంచి క్రిందికి పడవేశాడు. ఆ తరువాత?

ఏదో జరిగింది! నాన్న తనను అంత ఎత్తులోంచి ఎందుకు క్రింద పడేశాడు? ఎందుకా భయంకరమైన కేకలు?

భయంతో గట్టిగా కళ్లుమూసుకుంది. అలా ఎన్ని రోజులు పడుకుందో! వార్డులో సందడి ఎక్కువైపోతోంది. డాక్టర్లు, నర్సులు అంతా తిరుగుతున్నారు. అరుణకు తెలివి వచ్చిందని అంతా సంతోషించారు. అసలేం జరిగింది? ఎవరన్నద గాలి? చూచిన ప్రతివ్యక్తిని ప్రశ్నించాలని చూచింది కాని ఎవరికివారు హడావిడిగా తిరుగుతున్నారు. దాదాపు పదిగంటలకు ఇద్దరు పోలీసులు, ఒక ఇనస్పెక్టర్ వచ్చారు. అరుణను ప్రేమతో పలకరించారు.

ఎందుకో వారిని చూడగానే అరుణకు భయం వెయ్యలేదు. అందునా ఆ ఇనస్పెక్టర్‌స్టూలు లాక్కొనిదగ్గరగాకూర్చుని మాట్లాడుతుంటే ఆమెకుధైర్యంవచ్చింది.

"మా అమ్మా, నాన్న ఎక్కడున్నారండీ? ఒకసారి పిలిపించరూ?"


ఆయన రుమాలు కోసం నాలుగు జేబులు వెతుకుకుని ఒక జేబులోంచి తీసిఓమారు ముఖం తుడుచుకున్నాడు

ఆ ఎనిమిదేళ్ళ బిడ్డకి ఏం చేప్పాలి?

"నీకేం తెలియదా అరుణా? ఏమీ గుర్తులేదా?"

"నాన్న నన్ను కిటికీలోంచి బయటికి విసిరివేశాడు, అంతా గోలగా అరుస్తున్నారు. ఆ తరువాత నాకేం తెలియదు"

"బాసమ్మా-సైకిల్ నేర్చుకుంటున్న ఓ కుర్రవాడు అడ్డురాగా దాన్ని తప్పించుకునిప్రక్కకు వెళ్తున్న డ్రైవర్ కంట్రోల్ తప్పింది వాన్. అతడు అరిచాడేమో ప్రక్కలోనే సుమారైన నీటిమడుగు ఉంది. మీనాన్న నిన్ను గబుక్కున బయటికి పారేశాడు. ఆ తరువాత వాన్ ఆ మడుగులోకి దొర్లి పడి




పోయింది. ఆ వాన్‌లో ముప్ఫైఒక్కడు వున్నారు. నువ్వొక్కదానివి బ్రతికి బయటపడ్డావు."

"ఐతే అమ్మా .... నాన్న ...." అంటూ ఘొల్లుమన్నది అరుణ.

"ఔనమ్మా! అందరూ – మీఅమ్మా–నాన్నగారు కూడా దేవుడి దగ్గరి కెళ్ళిపోయారు.

"నేనూ వెళ్ళిపోతాను. వాళ్ళెక్కడుంటే అక్కడికే పోతాను." అరుణ మారాంచేస్తున్నలా ఏడుస్తూంది.

"మనల్ని పిలవందే ఎక్కడికీ వెళ్ళం. నీ ఫ్రెండ్ ఇంటికి ఏదైనా పార్టీ వుంటే పిలవకుండా వెళ్తావా? లేదు. ఎవరైనాసరే మనల్ని రమ్మని పిలవాలి, మనం వెళ్లాలి. అంతేగాని దేవుడూ, వచ్చేస్తున్నాను–అని మనం వెళ్తే దేవుడు రానివ్వడు. చాల కోపంకూడ వస్తుంది. పిలిచేదాక ఆగాలమ్మా అరుణా!"

చెంపలమీదుగా కారిపోతున్న కన్నీటిని చూస్తూ అంతా కళ్లు ఒత్తుకున్నారు. జాలితో చూస్తుండిపోయారు.

"ఈ ఊళ్లో మీ తాతగారున్నారు. వారింటికి తీసుకెళ్లి నిన్ను ఒదిలి రమ్మని చెప్పారు."

"ఎవరా తాతగారు? నేను ఎన్నడూ చూడలేదే" ఆశ్చర్యంతో అడిగింది.

"ఏమో అరుణా. నిన్ను ఎవరి దగ్గర ఉంచాలా అని ఆలోచించాము. ఈయన మీ అమ్మగారికి బాబాయి అట. నిన్ను తీసుకెళ్ళి వారిదగ్గర విడిచి పెడ్తామని చెప్పాము. ఒప్పుకున్నారు. నీకు బాగున్నదని డాక్టర్లు చెప్పారు. మరి వెళ్దామా?"

"ఊ" అంది. అరుణ. "ఉహూ" అనటానికి కారణాలగుపించలేదు.

ఆయన లేచి వెళ్ళాడు డిశ్చార్జి చేయించటానికి కాబోలు.

అరుణ కళ్లు మూసుకుంది.

తాతగారు! తనకొక తాతయ్య ఉన్నారన్నమాట!

ఆ లేతహృదయం తాత అనే మంత్ర పదాన్ని పదేపదే వల్లించుకుంది. అమ్మ నాన్న లేకుండా తను తాతదగ్గరుండాలి! ఫరవాలేదు తాతయ్యలు దేవు

డిలాలాంటివారు!

అంతే... వాళ్ళు పిల్లలపాలిటి దేవుళ్ళే!

తాత! తాతయ్య-! తాతయ్యగారు!

అరుణకు తాతగార్ని చూడాలన్న ఆరాటం ఎక్కువైంది.

తనకు నాన్నతరపున తాతయ్యలేరు. ఆయన ఎప్పుడో పోయారుట. అమ్మ నాన్నగారు తనకు రెండేళ్ళునిండకముందే పోయారు.

కాని తాతయ్య అనగా ఎవరు? ఎటువంటి వ్యక్తి? నిర్వచించమంటే ఎంత బాగా నిర్వచించగలదు!

తాతయ్య చక్కగా కథలు చెబుతారు. ఎన్నో విషయాలు చెబుతారు. వేరుశనక్కాయలు - టాఫీలు కొనుక్కోటానికి డబ్బు లిస్తారు. బజారునించి వచ్చేటప్పుడు ఏదో ఒక తినుబండారం తెస్తారు. ముఖ్యంగా-అన్నింటికన్నా ముఖ్యంగా ఏదైన కొంటెపని చేస్తే అమ్మా నాన్న వేంబె త్తపు దెబ్బలనించి అతిచాక చక్యంగా రక్షిస్తారు.

ఇదంతా అరుణ కెలా తెలుసు?

అరుణ ప్రక్క-ఇంట్లో తాతయ్య ఉన్నారు. తాతయ్య "తనం" అతడిలో మూర్తీభవించి ఉంది. అరుణ స్వతహాగా చాల అల్లరిపిల్ల. ఎన్నిసార్లు ఆ తాతయ్య తనను రక్షించలేదు!

ఆ తరువాత తనను కూర్చోబెట్టుకుని ఎంత నెమ్మదిగా బుద్ధిమాటలు చెప్పాడు! తాతయ్య మాటలు వింటున్నంతసేపు తను త్వరగా పెద్దదై పోయి మంచి అమ్మాయి అని పేరు దెచ్చుకోవాలని ఉబలాటపడిపోయేది. ఈమధ్య తాతయ్య చెప్పే నీతిసూక్తులు విని తనుచాలామారి పోయింది. మునుపటి గయ్యాళితనం అల్లరితనం చాలవరకు తగ్గించింది. కాని ఆ తాతయ్య మొన్నీమధ్యనే దేవుడి దగ్గర కెళ్ళిపోయాడు.

ఏమీ తోచక ఒంటరిగా బెంబేలు పడిపోయింది.

ఇంతలో ఈ వార్త.

అమ్మా నాన్న లేరు. కాని తాతయ్య ఉన్నాడు

ఆ తాతయ్యను ఈ తాతయ్య రూపంలో ఊహించు కుంటూ తృప్తి పడింది అరుణ.

ఇన్స్పెక్టర్ వచ్చి అరుణ తల మీద చేయి వేసి" లేమ్మా వెళ్దాము" అన్నాడు.

అరుణ లేచి కూర్చుంది. నర్సేసాయం పట్టి దింపి జోళ్ళు తొడిగింది. అక్కడ అరుణకు సంబందించిన వస్తువులు ఏమీ లేవు. మంచం దిగగానే ఇన్స్పెక్టర్ చేయి పట్టుకున్నాడు.

అరుణ చుట్టూ చూచింది. అంతా తన వేపే చూస్తున్నారు. ఒక్కరి ముఖంలో నవ్వు లేదు! జాలితో చూస్తున్నారు.

నర్స్ ఆ వార్డు చివరిదాకా వెళ్ళింది. "వుంటానండి" అని జవాబు కోసం చూడకండానే వెను దిరిగింది.


ఆమె కళ్ళలో నీళ్ళు తళుక్కుమనటం అరుణ గమనించక పోలేదు.

పోలీసు జీప్ పోర్టికోలో ఆగివుంది.

అరుణను ప్రక్కలో కూర్చోబెట్టుకుని పట్టుకున్నాడు.

"కూర్చోగలవా అరుణా?" ఏదో మాట్లాడాలని అడిగాడు.

"కూర్చోగలను" అంటూ సర్దుకుని కూర్చుంది.




ఆ చిన్నారి హృదయంలో ఎటువంటి ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయోగాని- ఇన్‌స్పెక్టర్ హృదయంలో పెనుతుఫాను రేగుతోంది.

దీనబంధు - అంటే అరుణ తాతగారు 'దీనబంధా' కాదు. వారూ వీరూ చెప్పగా ఇన్‌స్పెక్టర్ దీనబంధు ఇంటికెళ్ళాడు. అరుణకు దగ్గరబంధువు ఇతడే.

దీనబంధు ముందు ఒప్పుకోలేదు ? ఇన్‌స్పెక్టర్ జాలిగుండెలు కలవాడు కావడం చేత ఎంతో నచ్చజెప్పి ఒప్పించాడు. దీనబంధు పేదవాడుకాదు. కాస్త ఉన్నవాడే. ఏ కష్టం లేకుండా మరొకరిని పోషించగలడు.

"మీకేమండి. లక్షాధికారు. ఒక్క పసిపిల్ల మీకు భారమౌతుందా ?" అంటూ అతణ్ణి పైకి ఎత్తేశాడు.

దేనికి లొంగని ఆ తాతయ్య ఈ పొగడ్తకు లొంగిపోయాడు.

"దీనిలో మీ అమ్మగారి గొలుసు, రెండు గాజులు ఉన్నాయి." ఇన్స్పెక్టర్ ఆమె గుప్పిలిని అలాగే పట్టుకొని మెట్లెక్కి కాల్‌బెల్ నొక్కాడు.

తలుపు తీసిన నౌకరు వారిని కూర్చోబెట్టి లోపలి కెళ్ళాడు.

తాతయ్య వస్తారు. ఎలా ఉంటారు !

తాతయ్యలంతా ఒకేలా ఉంటారు. కాస్త పలుచబడిన తల - ఉన్నవెంట్రుకలలో సగం నెరిసిపోయి ఉంటాయి. కళ్ళద్దాలు పెట్టుకుంటారు కాస్త ముడతలు పడిన ఆ ముఖంలో ఎల్లప్పుడూ నవ్వులు చిందుతాయి. అలా ఊహిస్తూన్న అరుణ దీనబంధు రావటంతో ఆత్రంగా చూచింది.

తాతయ్యలాగానే ఉన్నాడు. కాని—

అతడి ముఖంలో నవ్వు లేదు. ప్రసన్నత లేదు. చూపులు వాడిగా ఉన్నై. సీరియస్‌గా వచ్చాడు.

"నమస్కారమండీ !" అన్నాడు ఇనస్పెక్టరు.

అరుణ కూడ లేచి నమస్కరించింది.

అతడు దగ్గరికి రాలేదు. దూరం నించి వాడిగా చూశాడు.

"పిల్ల చాల నీరసంగా ఉందే. రెండు

రోజు లాగి తీసుకు రాలేకపోయారా?"
దూరంగా ఉన్నసోఫాలో కూర్చున్నాడు. అరుణ ఉండలేకపోయింది.

"మీరేనా తాతయ్యా" అంది ఆత్రంగా వెళ్ళి పక్కనే కూర్చుంటూ.

"తాతయ్యా ఇదిగో" అంటూ చేతిలోని సంచితీసి అతడి చేతిలో ఉంచింది. తనదంతా అతకి కప్పగించాలిగా మరి!

ఆయన ఆ చేతి రుమాలు మూటను విప్పారు. నానుత్రాడు పుస్తెలు - రెండు పేటల గొలుసు రెండు గాజాలు ఉన్నాయి.

"ఇంతేనా? ఇంకేంలేవు?" అని వెటకారంగా అడిగాడు.

"ఉన్నది తాతయ్యా! అంటూ తన మెడలో ఉన్న చిన్న ఒంటిపేటగొలుసు చటుక్కున తీసి ఆతడిచేతిలో ఉంచింది. దీనబంధు నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

ఇన్స్పెక్టర్ బ్రౌన్ కవర్‌ను బల్ల మీద ఉంచి, నమస్కరించి గబగబ బైటికెళ్ళిపోయాడు దిగులుగా.

నౌకరు కాఫీ ఫలహారం తెచ్చాడు.

"ఈ పిల్లకు తీసుకెళ్ళిపెట్టు"

"తాతయ్యా - నాపేరు మీకు తెలీదు కదూ? అరుణ అంటారు" అంది.

పొడిగా "ఊ" అని లేచి నుంచున్నాడు

"లోపలికెళ్ళు, నాకెన్నో పనులున్నాయి. సాయంత్రం కనబడు"

"తాతయ్యా మధ్యాహ్నం భోజనానికి రారా?" ఆత్రంగా అడిగింది.

"రాను"

"అయ్యో-మరి భోజనం ఎలా?" అమాయకంగా అడిగింది, ఆయన అంతగా పట్టించుకోలేదు. లేచి వెళ్ళిపోయాడు.

"ఆ ఇంట్లో మరెవరూలేరా?" అరుణ తాతయ్యా వెంటబడింది.

"ఒరేయ్ సుబ్బాయ్ అరుణని మేడమీదికి తీసుకెళ్ళు"

సుబ్బాయ్ వచ్చి మేడ మీదికి తీసుకెళ్ళాడు.

చాల విశాలమైన రెండు గదులు దాటి బాల్కనీమీది కెళ్ళారు. అక్కడ ఒకావిడ పడుకుని ఉంది. చూడగానే ఏదోవ్యాధితో బాధపడుతున్నదిలా ఉంది.

సుబ్బాయ్ అరుణను ఆమెదగ్గరికి తీసుకెళ్ళాడు.

బక్కపలుచగా ఈజీచైర్‌ను బల్లిలా కరుచుకున్న ఆమెను చూడగానే అరుణకు భయం వేసింది.

ఒక్కడుగు వెనక్కి వేసి గాభరాగా సుబ్బాయ్ వంక చూచింది.

"అమ్మమ్మగారు" అని వాడు వెళ్ళిపోయాడు.


ఆమె అరుణను చూస్తోంది. ఆ కళ్ళలో ప్రేమ, ఆప్యాయత తాలూకు ఛాయలు లేవు. శరీరం ఎంత చచ్చుగా అర్భకంగా ఆ చెయిర్‌లో పడిఉందో-ఆ కళ్లు అంత తీక్షణంగా - ధిస్ఫులింగాల్లా వున్నాయి. ఆ చూపులకే శక్తి వుంటే అరుణ భస్మమైపోయి ఉండేది.

దగ్గరకు రమ్మని పిలిచింది.

అరుణ బెదురుతూ సమీపించింది.

"ఎవరు నువ్వు?"

"దీనబంధు తాతయ్యగారు-నాకు...." అంది బెరుగ్గా.




"ఓ .... ప్రసాదు కూతురివా?"

"ఔనమ్మమ్మా!"

"ఇక్కడికెందుకొచ్చావ్" అంది కరుగ్గా.

"మా అమ్మా నాన్నా దేవుడి దగ్గర కెళ్ళారుకదూ. ఇక్కడే ఉండాలట"

"ఏవరన్నారేం" భయంకరంగా అరచింది.

"తాతయ్యగారు" అరుణ అంతగట్టిగాను అరచింది.

ఆ పసి హృదయంలో అప్పటికే అమ్మమ్మమీద ద్వేషభావం ఏర్పడింది.

"ఎవరేనీతాత ........ దోచుకోటానికొచ్చావే. ఇంటినీ? ప్రసాదు మంచి ఎత్తే వేశాడు" ఆమె వాక్ప్రవాహానికి అడ్డు ఉండకపోయేదేకాని వెంటనే సుబ్బాయ్ అరుణకు సైగచేసి బైటకి రమ్మన్నాడు.

"సుబ్బన్నా ........ ఆమెకెందుకంత కోపం?

"ఆమెకుపిచ్చి"

"నిజంగానా?"

"అలాంటి పిచ్చి కాదు. అమ్మగారి డబ్బంతా ఎవరికో అయిపోతుందని బాధ"

సుబ్బాయ్ అరుణను క్రిందికి తీసికెళ్ళి ఒక గది చూపించాడు. మంచం, చిన్న టేబిల్ కుర్చీ ఉన్నాయి. అలసిన ప్రాణం కావటం మూలాన అరుణ మంచంమీద పడుకుంది. వెంటనే నిద్ర పట్టేసింది.

ఎంతసేపు ప్రశాంతంగా నిద్రపోయిందో! మెలకువ వచ్చేసరికి ఆ గదిలో కొన్ని చిరపరిచిత వస్తువులు కానవచ్చాయి. వాటన్నింటి వైపు పరకాయించి చూసి బైటి కెళ్ళింది. బల్లమీద కంచం సిద్ధంగా ఉంది. అరుణను చూడగానే సుబ్బాయ్ కేక వేశాడు. ఓ నడిప్రాయం స్త్రీ వచ్చి అన్నం వడ్డించి వెళ్ళింది.

అరుణ ఇష్టం లేకపోయినా తిని ఆ తర్వాత ముందర వరండాలో కూర్చుని వీధిలోకి చూస్తుండి పోయింది. గంటలు దొర్లి పోతున్నాయి. కాఫీ వేళ అయింది.

తాతయ్య రాలేదని ఆరాటపడి పోతుంది. నాలుగైదుమార్లు లోపలికి వెళ్ళి "తాతయ్య ఎప్పుడొస్తారు ?" అని అడిగింది, సుబ్బాయ్ – "ఆమె" ముఖాలు చూచుకున్నారు.

ఆ కర్కోటకుడు ఎంత ఆలస్యంగా వస్తే అంత మంచిది. అతడు లేనంతసేపే ఆ యింట్లో ప్రశాంతత ! ఆ తరువాత వాళ్ళు కత్తిమీద సాము చేస్తూండి పోవాలి.

"ఇప్పుడే రారు. సాయంత్రం వస్తారు"

అరుణ ముఖం చిన్నపోయింది. సాయంత్రమైంది. అలాగే వరండాలో కూర్చుంది. అమ్మ – నాన్న లేరు — హృదయంలో కరుడుకట్టిన బాధ కన్నీటి రూపందాల్చింది.

కళ్ళు తుడుచుకుంటూ గేట్ కేసి చూస్తుంది.

దాదాపు ఆరుగంటలకు గేట్ ముందు రిక్షా ఆగింది.

ఆ దిగుతున్న వ్యక్తి తాతయ్యే !

అరుణ అంత దీరసంలోను గబగబ వెళ్ళింది. గేట్ తీసి వస్తున్న తాతయ్య చేయిపట్టుకుంది.

తాతయ్యా మీకోసం మధ్యాహ్నం నించి చూస్తున్నాను."

"ఎందుకు ?" చికాకుగా అడుగుతూ చేయి విడిపించుకోబోయాడు – కాని ఆమె ఆ చేతిమట్టుకు విడువలేదు.

"మధ్యాహ్నం ఒక్కతినే అన్నం తిన్నాను. మీరు తినలేదుకదూ ? ఆకలి వేయడంలేదూ ?...." అంటూ గబగబ లోపలికెళ్ళింది.

దీనబంధు వరండాలోని ఈజీచైర్‌లో పడుకున్నాడు ఆలోచనగా విసుగ్గా కొన్ని క్షణాలు దాటాయి.

"తాతయ్యా! ఈ మజ్జిగ తాగండి" అన్నది అరుణ. సుబ్బాయ్ పెద్ద స్టీలు గ్లాసు పట్టుకుని నుంచున్నాడు.

ఆత్రంగా, అపేక్షగా తనవెపు చూస్తున్న ఆ పిల్ల చర్యకు విస్తుపోతూ గ్లాసు అందుకున్నాడు.

ఎన్నడు నోరు (తనకై తాను) విప్పని సుబ్బాయ్ అన్నాడు "అయ్యగారూ – అమ్మాయిగారు మీ కోసం నాల్గు గంటల నించి ఎదురుచూస్తున్నారు"

"నాల్గు గంటల కెలావస్తా ననుకున్నావ్. నాకు పని లేదనుకున్నావా ?" గ్లాసు అందించి అరుణతో అన్నాడు.

"మీరు – ఆ ఇంట్లో ప్రక్కంటి తాతగారిలా ఇంట్లో ఉండరా ?"

"ఉహు నేనింకా పనిచేస్తున్నాను ప్రొద్దుటవెళ్ళి సాయంత్రం వస్తాను"

"ఓ .. నాన్నగారి లాగానా ?"

"ఔను"


అరుణ మాట్లాడలేదు. ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ తర్వాత చటుక్కునలేచి ఆ ముసలి చేతిని గట్టిగా పట్టుకుంది.

"మీ రెంతో మంచివారు తాతయ్యా" అంది. ఆ కంఠంలో ధ్వనించిన ఆప్యాయతకు దీనబంధు చకితుడయ్యాడు,

"ఎందుకు ?" ఆత్రంగా అడిగాడు. ఏమిచెబుతుందోనని.

"మీరే .... నాకిష్టమైన వస్తువులన్నీ నా గదిలో పెట్టించారుగా ? ఇక్కడున్నంత చక్కటి వస్తువులు కావుగాని




ఆవంటే నా కెంతో ఇష్టం, అమ్మానాన్న నాకోసం కొనిచ్చారు. ఆ పెద్ద బొమ్మ ఉంది చూశారూ! దాని ముక్కు నేను చిన్నప్పుడు తినేశానట! మీరు తాతయ్యగారు కాబట్టి నాకేమిటి ఇష్టమో మీకన్నీ తెలుసు" అంటూ ఆ చేతిమీద చెక్కిలి ఆన్చింది. దీనబంధు నివ్వెరపోయాడు.

ఈ పిల్ల ఎటువంటిది? చిన్నప్పుడు నేర్చుకున్న పద్యంలా ఈ పిల్లను దేవుడు తీయటి సుగంధ ద్రవ్యాలతో చేశాడేమో?

చేతులు కట్టుకొని నించున్న సుబ్బాయిని చూచాడు. "నీళ్ళు తోడానయ్యగారు" అన్నాడు వినయవిధేయతలతో.

"మీరు స్నానం చేసిరండి. హాయిగా కూర్చొందాం" అంది అరుణ.

ఆ పిల్ల నోటి వెంట వస్తున్న ప్రతి మాటకు అతడు ఆశ్చర్యపడిపోతున్నాడు.

అరుణ డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని ఏదో ఆలోచిస్తోంది. మేడమీది నుంచి పెడబొబ్బలు – గోల – ఏడ్పు వినవచ్చింది.

అరుణ భయపడి గబగబ బైటివరండాలోకి వెళ్ళిపోయింది.

గంటకు గాని దీనబంధు అరుణ ఉన్న చోటికి రాలేదు.

దీనబంధు రాగానే హాయిగ ఊపిరించింది.

"భయపడ్డావా!" తన కంఠంలోని మార్దవానికి తానే ఆశ్చర్యపోయాడు.

"ముందర భయపడ్డాను ఇప్పుడు లేదు. మీరున్నారుగా. అమ్మమ్మ ఏమైనా అంటే మీరు నన్ను రక్షిస్తారుగా. ఇంకెందుకు భయం?" ఎంతో ధీమాతో అంది.

ఆ పిల్ల తన మీద నిల్పుకున్న భరవసాను తెలిసికొని అప్రతిభుడై పోయాడు.

"అమ్మమ్మల సంగతి తెలీదు గాని - తాతయ్యలు చాల మంచివారు. దేవుడి లాంటి వారు-అని తెలుసు"

"ఎలా తెలుసు ?" అతడి ఆశ్చర్యానికి అంతులేకపోయింది.

"మరి మా ప్రక్కయింటి తాతగారుండేవారుగా ? వారు దేవుడి లాంటివారే నాకెందుకు తెలీదు ?"

"ఏం చేసేవారేమిటి ?" ఉత్సుకతతో అడిగాడు.

అరుణ కుదురుగా కూర్చుంది. ఆ పిల్లకు ఇంకా పూర్తిగా శక్తిరాలేదు. అయినా ఓపికగా తాతయ్య ఏమేమి చేసేవారో ఒక్క పొల్లు కుండా చెప్పింది.

"అలాంటి తాతయ్య ఒకరోజు దేవుడి దగ్గరకెళ్ళి పోయారు అప్పటినించి మరొక తాతయ్యను పంపమని దేవుడికి చెప్పేదాన్ని. దేవుడు ఎంతో మంచివాడు మిమ్మల్ని పంపాడు. మీలాంటి తాతయ్య ఉంటే నాకు ఎవ్వరు అక్కర్లేదు. తాతయ్య చెప్పిన మంచిమాటలు గుర్తున్నాయి. నేను మంచి పిల్లగా ఉంటాను. అరగంటపైగా ఆ విరామంగా మాట్లాడిన అరుణ కుర్చీలో చేరబడి నిద్రపోయింది.

పాలిపోయిన ఆ మోము దీనంగా ప్రశాంతంగా ఉంది. కాస్త దూరంగా నుంచుని అంతావిన్న సుబ్బాయ్ ఆ గంభీర నిశ్శబ్దాన్ని భరించలేక చప్పుడు చేయకుండా దూరంగా వెళ్ళిపోయాడు.

దీనబంధు ఆ చిన్నారి ముఖాన్ని తిలకిస్తూండిపోయాడు కాని హృదయంలో తీవ్రమైన సంచలనం రేగుతుంది. ఆ పాలిపోయిన చిన్న పెదిమలు మృదువుగ కదుల్తూ అవే మాటలని పునః పునఃఉచ్ఛరిస్తున్నట్లుభ్రమవడ్డాడు ఆమాటలుచెవుల్లో ఇంకా వినబడుతున్నాయి।

తను దేవుడి లాంటివాడా। బిగ్గరగా నవ్వా లనిపించింది. వేలుపోసి దొంగ సాక్ష్యంతో వ్యాజ్యం గెల్చి లక్ష రూపాయలు విలువజేసేఆస్తిని దాయాదులనించి పొందాడు.

పిల్లలు పుట్టి చనిపోతుంటే ఆ నేరమంతా భార్యమీద మోపి ఆమెను పిచ్చిదాన్నిగ జేశాడు.

కారణం।

తన తిరుగుళ్లకు ఆమె ఆటంకంగా ఉండరాదని.

ఉన్న అన్ని వ్యసనాలను అదుపులో పెట్టుకుని ఆ స్తిని కాపాడుకుంటూ ఉద్యోగము చేస్తున్నట్లు నటిస్తూ సర్వసౌఖ్యాలు అభవిను స్తున్నాడు. అంద విహీనమైన రోగిష్టి భార్యను పిచ్చిదాన్నిచేసి చావు కప్పగించాలని చూ స్తున్నాడు తనంటే అందరికీ భయమే.

సుబ్బాయ్ తండ్రి తనను నమ్మిన బంటు. వాడు పోతూ వీణ్ణి అప్పగించి పోయాడు. సుబ్బాయ్‌కి దీనబంధు అంటే చచ్చేటంత భయం. కాని అతి చాకచక్యంతో దీనబంధు ఆగ్రహానికి గురికాకుండా జాగ్రత్తగ మసలు కుంటాడు.

పనావిడ ఎవరోకాదు. ఆమె వంట మాత్రం చేస్తుంది తనవేలు విడిచిన పినతల్లి. ఆమెకు ఎవరులేరు. అందుకని తనకు వండిపెట్టడానికి తెచ్చుకున్నాడు

అంతేనా ?

తనుచేసిన పాపాలు ఇవేనా ?

తన జీవిత విధానం నచ్చక దత్త పుత్రుడు. కొడుకు ఎటో వెళ్ళిపోయాడు.

కన్నకడుపు కాదు, కాబట్టి అతడు బాధ పడలేదుగాని_వాడి తలిదండ్రుల ఆర్త నాదం తనకు ఈనాటికి విన్పిస్తుంది. వాడు వెళ్ళిపోయి పదిహేను సంవత్సరాలు దాటాయి. తనకు చీమకుట్టినట్లు కూడా అవలేదు. ఎందరు ఎన్నివిధాల తనను మార్చాలని జూచారు.

చివరికి అందరు తనను వదిలేశారు.

తనను గూర్చి ఎవ్వరు పట్టించు కోరు.

తనకు లేని దుష్టబిరుదులేదు. తనను గూర్చి అంతా ఎంత చెడుగా చెప్పుకుం టారో తనకు బాగా తెలుసు. కాకికి చేయి విదల్చని తను ఇన్స్పెక్టర్ ప్రతిమాలు కుంటే విధిలేక ఒప్పుకున్నాడు.

ఆ పిల్లను దూరంగా ఎక్కడో బోర్డిం గులో ఉంచి చదివించి ఏదో సంబంధం చూచి వదిలించు కోవాలనుకున్నాడు.

కాని!

తనకు ఏమైపోతుంది !

హృదయంలో ఈ భారం ఏమిటి !

దీనబంధు హృదయం పశ్చాత్తాపంతో కరిగిపోతోంది,

హృదయంవిగసిపడుతుంటే_ హృదయం పగిలిపోతుందేమో అన్నట్లు గట్టిగా పట్టు కుని ఏడ్చాడు.

అరుణకు మెలకువ రాలేదు.

సుబ్బాయ్ చాటుగ చూస్తూ కన్నీరు వత్తుకున్నాడు.

తనలాంటి పాషాణ హృదయులలో మానవతను మేల్కొల్పటానికి భగవం తుడు దేవతలని మానవుల రూపంలో పంపుతాడు కాబోలు !

అనుకుని అరుణను భుజంమీద వేసు కుని మేడమీదికి వెళ్లాడు.

నిద్రరాక - అలా చూరువంక చూస్తున్న భార్య, భర్త రాకను గుర్తిం చింది.

మరో గదిలో అరుణను పరుండజేసి మెల్లగా భార్యదగ్గరకు వెళ్ళాడు.

ఆమె కంటిలో కాంతిరేఖ మెరిసింది.

దీనబంధు ఎక్కువ మాట్లాడ లేదు.

"క్షమించు .... నన్ను క్షమించు అని మంచంమీద కూర్చుని ఆమె ఎదపై తల ఆన్చాడు

రేపో మాపో సుదీర్ఘ నిద్రలో మునిగిపోవటానికి సిద్ధమైన ఆ పిచ్చి దాని హృదయం స్పందించింది.

"ప్రేమ"కు ప్రత్యుత్తర మీయని హృదయం వుంటుందా ? ఆమె హృద యంలో మారు మూలలో మూసిన తలుపులు ఒక్కొక్కటిగా తెరుచు కున్నాయి.

మెల్లగా దంతపు పుల్లలా ఉన్న చేతిని అతి ప్రయాసతో ఎత్తి భర్త తనమీద వేసింది.

దీనబంధు హృదయం దూదిపింజలా తేలిపోయింది. అతడికి తెలుసు ఆ క్షణం నించి అంతా పచ్చగా అందంగా శోభిస్తుందని.

అరుణకు ఇదంతా తెలియదు. తాతయ్యను గూర్చి బంగారు కలలు కంటూ నిద్ర పోయింది.